

తాండూరు: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



పరిగి: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



తాండూరు: సయ్యద్ సాజీద్ అలీకి రాఖీ కడుతున్న కోట్రిక విజయలక్ష్మి



వికారాబాద్: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు రాఖీకడుతున్న ఆయన సోదరీమణులు

# ఘనంగా రక్షాబంధన్

తాండూరు, ఆగస్టు 19: అనురాగం, ఆప్యాయతలకు ప్రతీకైన రక్షా బంధన్ వేడుకలు సోమవారం తాండూరు నియోజకవర్గంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.తన శుభాన్ని కోరుకున్న అక్క చెల్లెళ్లకు, అన్నదమ్ముళ్లు బహుమతులిచ్చి కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి మంత్రి సీతక్క, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాతతో పాటు పలువురు మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాజీద్ అలీతో పాటు పలువురు మైనార్టీ సోదరులకు రాఖీ కట్టి భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటారు.



కొడంగల్: తహసీల్దార్‌కు రాఖీ కడుతున్న డిప్యూటీ తహసీల్దార్

**పరిగి:** రాఖీ పౌర్ణమి సందర్భంగా అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డికి రాఖీ కట్టారు. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనురాగానికి రాఖీ పండుగ ప్రతీక అని అన్నారు. రాఖీ పండుగ సోదరీ సోదరుల శాశ్వత బంధాలకు చిహ్నంగా ఉంటుందని తెలిపారు.

**కొడంగల్:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అనిత తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు



మహంతేశ మఠంలో యోగానంద స్వామితో భక్తులు

**బొంరాస్‌పేట:** దుద్యాల మండల కేంద్రంలోని మహంతేశ స్వామి మఠం నుంచి అఖండ జ్యోతి ఊరేగింపు గ్రామ వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా మహర్షి యోగానంద మాట్లాడుతూ మానవుడు దుఃఖ నివారణ కోసం సాత్విక జీవనం కొనసాగించాలని సూచించారు.

### ప్రజావాణి దరఖాస్తులను

# సత్వరమే పరిష్కరించాలి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఆగస్టు 19: సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అదనపు కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. రెవిన్యూ సమస్యలపై నేరుగా తహసీల్దార్లతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీపై వచ్చిన దరఖాస్తులను వ్యవసాయ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ముందుగా రక్షాబంధన్ సందర్భంగా అధికారులకు అదనపు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

### తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, ఆగస్టు 19 : శ్రీ అంబురామేశ్వర ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తట్టేపల్లి పరివాహక ప్రాం తంలో వెలసిన శ్రీ అంబురామేశ్వర దేవాలయంలో మాజీ జడ్పీటీసీ ధారాసింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రుద్రాభిషేకంలో పాల్గొని అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబురామేశ్వర ఆలయ అభివృద్ధికి దేవాదాయశాఖ తరపున, ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలను అందిస్తానన్నారు. దేవాలయ అభివృద్ధిలో భాగంగా స్థానిక దేవాలయ కమిటీ పెద్దలు ఆలయ ప్రాంగణంలో ఒక చెక్‌డ్యామ్ నిర్మాణం కావాలని అడిగారని త్వరలో దానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి.నారాయణ రెడ్డి, జితేందర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి,ఎస్.నారాయణ రెడ్డి,రవి శంకర్,డివై చిన్న నర్సిం హులు,కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌లు జి.అంజయ్య, బందె య్యా, డీవై పెద్ద నర్సింహులు,ఉప్పరి మల్లేషం,కిరణ్,వడ్ల ఆనం దం, విష్ణువర్ధన్ రెడ్డి,హర్షవర్ధన్ రెడ్డి,మైపూజ్,రాము నాయక్,ప్రముఖ న్యాయవాది ఈదులపల్లి గోపాల్ రెడ్డి,కె.నర్సింహులు,కె. గోపాల్,ఆలయ చైర్మెన్ వెంకటేశం,తదితరులు పాల్గొన్నారు.



రుద్రాభిషేక పూజలో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

# ప్రమాదకరంగా మారిన ముళ్ల పొదలు..



మర్పల్లి నుంచి పంచలింగాల్ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు

మర్పల్లి, అగస్టు 19 : మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా కలుపు మొక్కలు, ముళ్ల పొదలు పెరిగి ప్రమాదకరంగా మారింది. పంచలింగాల్, నర్సాపూర్ తండా, తుమ్మలపల్లి, బిల్‌కల్ తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముండ్ల పొదలు ఏపుగా పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచలింగాల్ నుంచి పెద్దకోలుకుంద, చిన్నకోలుకుంద, అంబ్రాది, మేకవనంపల్లి, సదాశివపేట పట్టణాలకు ఆ దారి వెంబడి వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు.. పొదలు పెరిగి రోడ్డుపైకి రావడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పంచలింగాల్ గ్రామానికి చెందిన చాకలి మల్లయ్య గతంలో పంచలింగాల్ సమీపంలో ఏపుగా పెరిగిన పొదల కారణంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని గ్రామస్తులు గుర్తు చేశారు. బిల్‌కల్ గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వచ్చి ఎదురుగా వాహనాలు కనిపించడం లేదని తెలిపారు. రాత్రి పూట ఆ రోడ్లపై వెళ్లాలంటే ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కలుపు మొక్కలు, ముళ్ల పొదలను తొలగించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు..

# చీకెన్ బిర్యానీ

## ప్రజారోగ్యంతో చెలగాటం

### గచ్చిబౌలిలో పలు చోట్ల ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



సిటీబ్యూరో, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోన్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ, వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపుతున్నది. ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్‌మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పై కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే గచ్చిబౌలిలోని పలు ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు గచ్చిబౌలిలో ఫ్లైఛజో వంటగది అపరిశుభ్రంగా ఉందని, డస్ట్‌బిన్‌లపై సరైన మూతలు లేకుండా తెరిచి ఉన్నట్లు గుర్తించారు. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసిన కొన్ని ఆహార పదార్థాల ప్యాకింగ్‌లకు లేబుల్స్ సరిగా లేవని, ప్యాకేజ్డ్ చికెన్ రోజుల తరబడి నిల్వ ఉన్నట్లు గుర్తించారు. గచ్చిబౌలిలోని ది గ్లోబ్ గుర్భ్‌లో ఆర్వో వాటర్ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేవని తేల్చారు. గచ్చిబౌలిలోని హోయ్ పంజాబ్‌లో నిల్వ చేసిన వెజ్ బిర్యానీ చూసి అధికారులు ఖంగుతిన్నారు. వంటలో వినియోగించే నూనె జిడ్డుగా ఉన్నట్లు గుర్తించారు. వాటర్ బాటిళ్లలో వాటర్ ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు.

# రుణమాఫీ కాని రైతులు అధైర్యపడొద్దు



రైతులకు అవగాహన కలిగిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు

కులకచర్ల, ఆగస్టు 19 : రుణమాఫీ కాని రైతులు అధైర్యపడవద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో రుణమాఫీ కాని రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం మూడు విడుతలుగా రుణాలు మాఫీ చేసిందని నాలుగవ విడుతలో అర్హత ఉన్న రైతులందరికీ రుణాలు మాఫీ చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

పరిగి ఎమ్మెల్యే టీ రామ్మో హన్‌రెడ్డి ఆదేశాలమేరకు రుణమాఫీ కాని రైతులు రుణమాఫీ కాలేదని ఒక ఫారం నింపి పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, బ్యాంక్ స్టేట్‌మెంట్, ఆధార్‌కార్డు జతపర్చి మండల వ్యవ సాయాధికారికి సమర్పించాలన్నారు. అర్హత ఉన్న రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తుందని ఎవ్వరు కూడా అధైర్యపడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రుణాలు మాఫీ కాని రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నేడు బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

బొంరాస్‌పేట, ఆగస్టు 19 : బొంరాస్‌పేట మండల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెంగళరావునగర్, ఆగస్టు 19: అమీర్‌పేట మైత్రీవనం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదానికి కారణమైన సాఫ్ట్‌వేర్ మహిళా ఉద్యోగినిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. బేగంపేటలోని మోతీలాల్ నెహ్రూనగర్‌కు చెందిన ఎం.ప్రసాద్(19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం మెదక్ చర్చిలో జరిగిన ఓ కార్యక్రమానికి ప్రసాద్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. రాత్రి తిరిగి నగరానికి చేరుకున్నారు. రహ్మత్ నగర్ డివిజన్ కార్మికనగర్‌లో ఉంటున్న మేనమామ ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై ఒంటరిగా ఇంటికి బయలుదేరాడు. అర్ధరాత్రి 1.51 గంటల సమయంలో ఎస్‌ఆర్ నగర్ నుంచి మైత్రీవనం వైపు వస్తుండగా.. వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ కారును కొత్తపేట నివాసి అయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని భావన(31) డ్రైవింగ్ చేస్తున్నట్టు గుర్తించారు. ఆమె వెంట కారులో మరో ఇద్దరు ఉన్నారు. ఇదిలా ఉండగా.. కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన బాధితుడు ప్రసాద్‌ను సమీపంలోని దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాద సమయంలో మృతుడు హెల్మెట్ ధరించలేదని, ధరించి ఉంటే ప్రాణాలు దక్కేవని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఆర్ నగర్ పోలీసులు ప్రమాదానికి కారణమైన భావనను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### న్యాయవాదిపై దాడిచేసిన పోలీసులపై

# చర్యలు తీసుకోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 19 : న్యాయవాదిపై దాడిచేసి, అక్రమంగా నిర్బంధించిన పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ద గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బోరబండ పీఎస్‌లో న్యాయవాదిపై పోలీసుల దాడిని నిరసిస్తూ... కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి కోర్టు సముదాయం వద్ద నిరసన తెలిపారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్ స్టేషన్లలో న్యాయవాదులకు మర్యాద, గౌరవాన్ని ఇవ్వాలని కోరారు. బాధితుల పక్షాన, న్యాయం కోసం వచ్చే న్యాయవాదులను అక్రమంగా నిర్బంధించడం తగదన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి రమేశ్, నటరాజు, యాదయ్య, పాషా, శ్రీలత, అరుణ్‌కుమార్, సదాలక్ష్మి, ప్రవీన్, విజయ్‌కుమార్, రమేశ్, చంద్రమౌళి, నాగలక్ష్మి, పల్లివి, జ్యోత్స్నాదేవి, మహిపాల్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**

★ కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142. NT- 326218

**WANTED**

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-325790-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

### వేడి నీరు పైనబడి.. చిన్నారి మృతి

కుత్బుల్లాపూర్, ఆగస్టు 19: వేడి నీరు పైనపడటంతో గాయలపాలైన మూడేండ్ల చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పేట్ బషీరాబాద్ పీఎస్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. కొంపల్లి అశ్వినికాలనీలో నివాసముంటున్న సురేశ్, మెట్యార్యరతన్ దంపతుల కూతురు అక్షర(3). ఈ నెల 9న తన తల్లి మెట్యార్యరతన్ చిన్నారికి స్నానం చేయించేందుకు బకెట్‌లో వేడి నీరు పోసింది. ఆ వేడి నీటి బకెట్, చిన్నారి తీసుకొని బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. అయితే. సబ్బు మర్చిపోవడంతో తల్లి బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చింది. బకెట్‌తో చిన్నారి ఆడుకోగా.. ప్రమాదవశాత్తు ఆ వేడి నీరు చిన్నారి ముఖం, కడుపుభాగంలో పడి కాలడంతో ఒక్కసారిగా ఏడ్చింది. తల్లి వెంటనే స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించగా.. తీవ్రంగా గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది.

# వెలగని గృహజ్యోతి

• అర్హులకు ఇక్కట్లు..• ప్రజా పాలన సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు • పనిచేయని వెబ్‌సైట్‌తో ఇబ్బందులు



నగర శివారులోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకుంటున్న అర్హులు

**ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు విస్మరిస్తున్నది. వాటిలో ఒకటి గృహజ్యోతి పథకం. ఆది నుంచీ పలు నిబంధనలు పెట్టిన ప్రభుత్వం ఇప్పటికీ సరిగా అమలు చేయడం లేదు. తెల్ల రేషన్‌కార్డు ఉంటేనే గృహజ్యోతి పథకం వర్తిస్తుందని ప్రకటించింది. దీంతో అర్హులైన ప్రజలు ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావొస్తున్నా పలు కారణాలతో లబ్ధిదారులకు మాత్రం ఇప్పటికీ పథకం అమలు కావడం లేదు. తెల్ల రేషన్‌కార్డు నిబంధనతో కొంతమంది పథకానికి దూరమవ్వగా, ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేటప్పుడు జరిగిన పొరపాట్లతో మరికొందరికీ ఈ పథకం అందడం లేదు. అర్హులు దరఖాస్తు చేసుకోవడానికి ఆయా కార్యాలయాలకు వెళ్తే.. వెబ్‌సైట్ సరిగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెబ్‌సైట్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.**

సిటీబ్యూరో, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ముఖ్యంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వారందరికీ ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీని మరిచి కేవలం తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారికే ఈ పథకం వర్తిస్తుందని ప్రకటించింది. దీంతో అర్హత ఉన్నప్పటికీ చాలా మంది ఈ పథకానికి దూరమయ్యారు. అదే సమయంలో అద్దె ఇళ్లలో ఉండే వారికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేటప్పుడు జరిగిన పొరపాట్లతో కొందరు ఈ పథకానికి నోచుకోవడం లేదు. తెల్ల రేషన్‌కార్డు నిబంధనతో లక్షలాది మంది అర్హత కోల్పోగా, మరికొందరు ఇతర కారణాలతో లబ్ధి పొందలేకపోతున్నారు. తెల్ల రేషన్‌కార్డు కలిగి అద్దె ఇళ్లల్లో ఉంటున్న వారు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రజా పాలన దరఖాస్తు సమయంలో మీటర్ నంబర్ రాయకపోవడం వల్ల ఇప్పుడేమీ చేయలేమని చెప్పడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇచ్చిన తర్వాత సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా ప్రజాపాలన పోర్టల్ సరిగా ఓపెన్ అవడం లేదని అర్హులు వాపోతున్నారు.

### పనిచేయని వెబ్‌సైట్...

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాల్సింది దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్). అయితే గ్రేటర్ పరిధిలో నివాసం ఉంటే జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లో, నగర శివారు ప్రాంతాల్లో అయితే మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటే మండల ప్రజా పరిషత్ కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులను ఇవ్వాల్సి ఉంది. తెల్ల రేషన్‌కార్డు ఉండి అర్హులైన వారు ఆయా కార్యాలయాలకు వెళ్లినా అక్కడ ఈ పథకానికి సంబంధించిన వెబ్‌సైట్ (https://prajapalana.telangana.gov.in) సరిగా పనిచేడం చేయలేదని వారు వాపోతున్నారు. నగర శివారు మున్సిపల్ కార్పొరేషన్ అయిన బండ్లగూడ జాగీర్‌లో కార్యాలయానికి స్వయంగా వెళ్లినా, ఒక్క రోజులో పని పూర్తి కావడం లేదని, పలుమార్లు కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందని అర్హులు వాపోతున్నారు. ఇలా ఒక్క చోటే కాదు గ్రేటర్ చుట్టు పక్కల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లతో పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని సర్కిల్ కార్యాలయాల్లోనూ గృహజ్యోతి అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గృహజ్యోతి పథకాన్ని ఏప్రిల్ నుంచే అమలు చేస్తున్నా, ఇప్పటికీ అర్హులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజాపాలనకు సంబంధించిన వెబ్‌సైట్ సమర్థవంతంగా పనిచేసేలా తీర్చిదిద్దాలని గృహజ్యోతి అర్హులు కోరుతున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962

## బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా క్లయింట్లు షెడ్యూల్‌లో వివరించిన ఆస్తులను దిగువ షెడ్యూల్‌లో తెలిపిన సంబంధిత ఆస్తుల ఏకైక మరియు పూర్తి యజమానులు మరియు శాంతియుత స్వాధీనదారులుగా క్లెయిమ్ చేయబడుతున్న a) శ్రీ ఎన్నం వినయ్ కుమార్ రెడ్డి తండ్రి ఎన్నం రఘుపతి రెడ్డి, వయస్సు సుమారు 39 సంవత్సరాలు, నివాసం: 1-19/ఎ, సంగెం గ్రామం, కేశంపేట మండలం, రంగారెడ్డి (గతంలో మహబూబ్‌నగర్ పార్ట్) జిల్లా, తెలంగాణ, b) శ్రీ పుట్టల జంగయ్య తండ్రి మల్లయ్య, వయస్సు సుమారు 56 సంవత్సరాలు, నివాసం: 8-80, ఈశ్వరమ్మ కాలనీ, బాలానగర్, మహబూబ్‌నగర్, తెలంగాణ మరియు c) శ్రీ ఉల్కుందకరు నర్సింలు తండ్రి బలరాం, వయస్సు సుమారు 52 సంవత్సరాలు, నివాసం: 3-156, బాలానగర్, మహబూబ్‌నగర్, తెలంగాణ వారి నుండి కొనుగోలు చేయుటకు ఉద్దేశిస్తున్నారు.

ఆస్తిలో ఎవరైనా వ్యక్తి/లు ఏదేని హక్కు, టైటిల్, అభ్యంతరం,క్లెయిమ్‌లు లేదా ఏదేని స్వభావం కలిగిన ప్రయోజనం కలిగి ఉంటే, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 10 (పది)రోజులలోగా దాని యొక్క డాక్యుమెంటరీ రుజువుతో దిగువ సంతకందారుకు తెలియజేయవల్సిందిగా ఇందుమూలముగా కోరబడుతున్నారు. సదరు కాలవ్యవధి తర్వాత షెడ్యూల్ ఆస్తికి సంబంధించి ఏ విధమైన క్లెయిమ్ అనుమతించబడదు.

**షెడ్యూల్**

**శ్రీ ఎన్నం వినయ్ కుమార్ రెడ్డి ఆస్తి**

సంగెం గ్రామం, కేశంపేట్ మండలం, రంగారెడ్డి (గతంలో మహబూబ్‌నగర్ పార్ట్) జిల్లా, తెలంగాణ వద్ద గల సర్వే నెం.89/ఆ3/1 (ఎక.1-25 గుంటలు), 89/ఆ3/2 (ఎక.1-25 గుంటలు), 89/ఆ/1/1 (ఎక.0-30 గుంటలు) మరియు 89/ఆ/1/2 (ఎక.0.30 గుంటలు) లో ఎక.4-30 గుంటలు విస్తీర్ణం భూమి యావత్తు, సరిహద్దులు:

| దిక్కులు | సరిహద్దులు |
|---|---|
| ఉత్తరం | సర్వే నెం.90లో పి.సువర్ణ భూమి |
| దక్షిణం | కొత్తపేట్ నుండి సంగెం రోడ్ |
| తూర్పు | ఎలక్ట్రిసిటీ (కరెంట్) సబ్‌స్టేషన్ మరియు వై.నారాయణ రెడ్డి మరియు అతని కొడుకుల భూములు |
| పడమర | సర్వే నెం.89/పార్ట్‌లో జంగయ్య మరియు నర్సింలు భూమి |

**శ్రీ పుట్టల జంగయ్య మరియు శ్రీ నరసింహులు ఆస్తి**

సంగెం గ్రామం, కేశంపేట్ మండలం, రంగారెడ్డి (గతంలో మహబూబ్‌నగర్ పార్ట్) జిల్లా, తెలంగాణ వద్ద గల, a) శ్రీ పుట్టల జంగయ్యకి చెందిన, సర్వే నెం.89/ఆ/2/3/1 (0-28 గుంటలు) మరియు 89/ఆ/2/3/2/2 (ఎక.0-01 గుంటలు) లో ఎక.0.29 గుంటలు, b) శ్రీ ఉల్కుందకరు నర్సింలుకు చెందిన, సర్వే నెం.89/ఆ/2/2/1 (0-28 గుంటలు) మరియు 89/ఆ/2/3/2/1 (ఎక.0-01 గుంటలు) లో ఎక.0-29 గుంటలు విస్తీర్ణం భూమి యావత్తు, సరిహద్దులు:

| దిక్కులు | సరిహద్దులు |
|---|---|
| ఉత్తరం | సర్వే నెం.89లో పొరుగువారి (ఇతరుల) భూమి |
| దక్షిణం | షాద్‌నగర్ నుండి కొత్తపేట్ రోడ్ |
| తూర్పు | సర్వే నెం.89లో వై.వినయ్ కుమార్ రెడ్డి భూమి |
| పడమర | సర్వే నెం.89లో జె.విజయ, శివానంద్ ప్లాట్స్ మరియు ఇతర భూమి |

20-08-2024

సం/-

**ఆర్. యల్లా రెడ్డి, ఆర్. వరలక్ష్మి,**
**M/s. యల్లా లీగల్, అడ్వకేట్స్**
302, మా నివాస్, ప్లాట్ నం. 90/MIG, ఫేస్-II, ధర్మారెడ్డి కాలనీ, హైదర్‌నగర్, హైదరాబాద్ - 085,
Email:yellareddy@yellalegal.com; Mobile: 9246530551